తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్
మంగళవారం
25 నవంబర్ 2025
పేజీలు : 08



Follow :



## రిలయబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో
# దుప్పట్లు, స్వెటర్స్ పంపిణీ

- మంత్రి దనసరి అనసూయ సీతక్క

ఏటూరునాగారం, నవంబర్ 24(జనంసాక్షి) : ఏజెన్సీ ప్రాంతమైన ఏటూరు నాగారం మండలంలోని చింతలకుంట, గుండంగవాయి, గంటలకుంట పలు గ్రామాల ప్రజలకు హైద్రాబాద్ కి చెందిన రిలయబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో దుప్పట్లు, స్వెటర్స్ పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పాల్గొని దుప్పట్లు పంపిణీ చేశారు. గతంలో ములుగు జిల్లాలో వరదలు వచ్చినప్పుడు కూడా రిలయబుల్ ట్రస్ట్ వారు వరద ప్రభావిత ప్రాంతాల్లో సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారని, ములుగు జిల్లాలో వారి సేవలు అభినందించాల్సిన విషయం అని రిలయబులు ట్రస్ట్ సంస్థ వారిని మంత్రి సీతక్క అభినందించారు. మంత్రి సీతక్క చేసే సేవా కార్యక్రమాలు ఆదర్శంగా తీసుకునే మా రిలయబుల్ ట్రస్ట్ సంస్థ సేవా కార్యక్రమాలు చేస్తున్నామని మంత్రి సీతక్క కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు, రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ యాదవ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గద్దల నవీన్, మండల సీనియర్ నాయకులు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు వడ్డీ లేని రుణాల పంపిణీ

- కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి
- విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం




వరంగల్ ప్రతినిధి, నవంబర్ 24 (జనంసాక్షి): జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలలో మంగళవారం స్వయం సహాయక మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అన్ని సెగ్మెంట్లలో ఏకకాలంలో పండుగ వాతావరణంలో జరిగేలా విస్తృత ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం సచివాలయం నుండి మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సెర్ప్ సీ.ఈ.ఓ దివ్య దేవరాజన్ తదితరులతో కలిసి ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క ఇందిరమ్మ చీరల పంపిణీ, వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ నెల 25వ తేదీన (మంగళవారం) అన్ని సెగ్మెంట్లలో వడ్డీ లేని రుణాల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి, వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో ఘనంగా ఏర్పాట్లు చేయాలని, మంత్రివర్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఇతర ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని వారికి ముందుగానే సమాచారం అందించాలని సూచించారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాలలో గల 10 వేల 357 స్వయం సహాయక సంఘాలకు రూ. 6 కోట్ల 52 లక్షల వడ్డీ లేని రుణాల కింద పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ప్రభుత్వ అభిమతానికి అనుగుణంగా వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను కార్యోన్ముఖులను చేశారు. నియోజకవర్గ స్థాయిలో చేపట్టే ఈ కార్యక్రమంలో మండల, గ్రామ మహిళా సమాఖ్యల ప్రతినిధులు అందరూ హాజరయ్యేలా చూడాలన్నారు. జెడ్పి సీఈఓ, ఇంచార్జి డీ.ఆర్.డీ.ఓ రామిరెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధులు ఉమా, రాధిక ఐ.కె.పీ అధికారులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికలను
# ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

- అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలి
- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- నేను ఎమ్మెల్యేగా రాజీనామా చేయడం లేదు
- స్పీకర్ నిర్ణయం ఎల ఉన్నా ఎదుర్కొనేందుకు సిద్ధం



స్టేషన్ ఘన్ పూర్, నవంబర్ 24 (జనంసాక్షి) :గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకో వాలని, అందరం కలిసికట్టుగా, సమన్వయంతో పనిచేసి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురావేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని ఈఆర్ఎల్ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి విస్తృత స్థాయి సమావేశానికి శిరీష్ రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలలో పోటీ చేసే సర్పంచ్, వార్డు మెంబర్ల అభ్యర్థులను ఎంపిక చేసే బాధ్యత గ్రామ స్థాయి నాయకులదేనని, వారిని గెలిపించే బాధ్య త కూడా గ్రామనాయకులదేనని స్పష్టం చేశారు. గ్రామం లోని కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామస్తుల ఏకాభిప్రాయం మేరకే అభ్యర్థుల ఎంపిక జరగాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీనుండి ఒకేఅభ్యర్థి పోటీలో ఉండే విధంగా గ్రామ నాయకులు మండల స్థాయి నాయకుల సహకా రంతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. పాత, కొత్త అనే బేధం లేకుండా అందరూ కలిసి పని చేయా లని కోరారు. ప్రస్తుతం అందరి చూపు నియోజకవర్గం వైపే ఉందని, అందరికీ కాంగ్రెస్ పార్టీకి తిరుగులేదని నిరూపించాలని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అత్యధిక నిధులు మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అన్ని సర్పంచ్, ఎంపిటిసి, జడ్పిటిసి స్థానాలనుగెలిపించి కానుకగా ఇచ్చి మరిన్ని అభివృద్ధి నిధులు తెచ్చుకోవాలని పిలుపునిచ్చారు. అభ్యర్థి ఎంపిక నిర్ణయం మీదే,అభ్యర్థి గెలుపు బాధ్యత కూడా మీదేనని వెల్లడించారు. అభ్యర్థి ఎంపిక ఏకగ్రీవం చేస్తే గ్రామాభివృద్ధికి 10లక్షలు,సర్పంచ్ ఎన్నికను ఏకగ్రీవం చేస్తే గ్రామ అభివృద్ధికి 25లక్షలు మంజూరు చేస్తానని మిగతా 2లో..

## డేంజర్ జోన్ గృహాలను తక్షణమే సేకరించి
# నష్ట పరిహారం ఇవ్వాలి

- ప్రజావాణిలో వినతి



మల్హార్,నవంబర్ 24(జనం సాక్షి) : మండల కేంద్రమైన తాడిచెర్ల లోని ఓసిపి బ్లాక్ 01 కు 500 మిట్లర్ల డేంజర్ జోన్లో ఉన్న నివాస గృహాలను సేకరించి నష్టపరిహారం పునరావాస ప్యాకేజి అందజేసి సురక్షిత ప్రాంతాలకు తరలిం చేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో భాగంగా సోమవారం భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ కు తాడిచెర్ల భూ నిర్వాసితులు తాండ్ర మల్లేష్ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈనెల 12 న రాష్ట్ర ఎనర్జీ డిపార్టుమెంటు చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, జెన్కో సిఅండ్ ఎండి లు తాడిచెర్ల ఓసీపీని సందర్శించి ఓసిపి వ్యూ పాయింట్ నుండి పరిశీలించారని డేంజర్ జోన్లో ఉన్న 1080 ఇండ్లకు నష్టపరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజి, పునరావాస ప్యాకేజి కలిపి లమ్సమ్ అమౌంట్ ఇవ్వమని తెలిపినట్లు తెలిసిందని అన్నారు. 2008 లో ఏపి జెన్కో పేరిట నంబర్లు వేసి పదిహేనేళ్లు కావస్తున్నందున అప్పుడు ఉన్న చిన్న వారు ఎదిగి వివాహలు చేసుకుని కుటుంబాలుగా జీవిస్తునారని కాబట్టి 1080 ఇండ్లకు బదులుగా 30 శాతం పెంచి, పెరిగిన గృహలకు గాను నష్టపరిహారం ప్యాకేజి ఇవ్వాలని లేని పక్షంలో పూర్వం నుండి తాడిచెర్ల గ్రామంలో నివసిస్తున్న అందరి ఇండ్లకు, భూములకు 2013 భూసేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో డిసెంబర్ మొదటి వారంలో భూ నిర్వాసితులతో కలిసి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భూ నిర్వాసితులు తాండ్ర మల్లేష్ తో పాటు పలువురు నిర్వాసితులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లను సవరించాలి : బిజెపి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్



మంచిర్యాల ప్రతినిధి, నవంబర్ 24 (జనంసాక్షి) : రాష్ట్ర ప్రభుత్వం తప్పుల తడకగా బీసీ రిజర్వేషన్ కేటాయించి మరొకసారి బీసీ లకు అన్యాయం చేసిందని, రిజర్వేషన్లు సవరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర గౌడ్ పేర్కొన్నారు. సోమవారం నాడు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో భాగంగా జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుల తడకగా రిజర్వేషన్లు ఇవ్వడాన్ని ఆయన తప్పు పట్టారు. మంచిర్యాల జిల్లాలో 306 సర్పంచ్ స్థానాలు ఉంటే కేవలం 21 స్థానాలు మాత్రమే బీసీలకు కేటాయించారని ఆయన తెలియజేశారు. గతం లో కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం బీసీలకు రిజర్వేషన్ ఇస్తామని జీవో ఇచ్చి బీసీలను నయవంచనకు గురి చేసిందన్నారు. బీసీల పట్ల చిత్తశుద్ధి లేని ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆయన తెలియజేశారు. సర్పంచ్ మరియు ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల్లో 42% రిజర్వేషన్లు కేటాయిస్తామని చెప్పి బీసీ లు ఎక్కువగా ఉండే గ్రామాల్లో కేవలం ఏడు శాతం కేటాయించి బీసీల పట్ల పక్షపాత వైఖరి చూపించిందన్నారు. బీసీలను ఈ ప్రభుత్వం బిచ్చగాళ్ళలా చూస్తుందని ఆయన మండిపడ్డారు. కోటపల్లి మండలంలో భీమారం మండలంలో 50% ఓసీలకు రిజర్వేషన్ చేసి ఒక్కటి కూడా బీసీల కేటాయించలేదని ఆయన పేర్కొన్నారు.చెన్నూరు లో రెండు స్థానాలు కేటాయించి బిచ్చగాల్లలా బీసీ లను చేసిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన బీసీ డిక్లేషన్ హామీని 42 శాతం రిజర్వేషన్ హామీని విస్మరించి ప్రభుత్వం బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసింది అన్నారు. కేవలం ఏడు శాతం రిజర్వేషన్ మంచిర్యాల జిల్లాలో అమలు చేయడం పట్ల బీసీల ఆత్మగౌరవని దెబ్బతీయడమే అని ఆయన అన్నారు. తక్షణమే రిజర్వేషన్ల అంశాన్ని పునరాలోచించి బీసీలకు గతంలో ఉన్న మాదిరిగా చట్టబద్ధంగా కనీసం 22% రిజర్వేషన్ జిల్లాలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వంపై పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎనగందుల కృష్ణమూర్తి,జిల్లా ఉపాధ్యక్షులు జోగుల శ్రీదేవి, పట్టుతినేని కమలాకర్ రావ్, కోటపల్లి మాజీ ఎంపీపీ మంత్రి రామయ్య, నాగేశ్వర్ రావు, మంచిర్యాల కార్పొరేషన్ వివిధ జోన్ల అధ్యక్షులు, అమీరిశెట్టి రాజు కుమార్, కుర్రె చక్రవర్తి, సత్రం రమేష్ మరియు మద్ది సుమన్ యాదవ్, బుర్ర చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# గత చట్టాలను యథావిధిగా కొనసాగించాలి



కాసిపేట, నవంబర్ 24 (జనంసాక్షి) : పెట్టుబడి దారి వ్యవస్థ బడా కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును వ్యతిరేకిస్తూ గత చట్టాలను కొనసాగించాలని కాసిపేట ఒకటవ రెండవ గని పై కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగుల ప్రయోజనాలకు నష్టం కలిగించగల మార్గదర్శకాలు ఉన్న నూతన కార్మిక కోడ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు చేయడానికి అంగీకరించేది లేదని మైన్స్ మరియు ఐడి చట్టం ఇతర ఉద్యోగ సంక్షేమ చట్టాలలో ఉన్న రక్షణలను పూర్తిగా కొనసాగించడానికి గతం నుంచి కొన సాగుతున్న చట్టాలను యధావిదంగా కొనసాగించాలని కోరారు. కొత్త కోడ్లు కార్మిక వర్గ ప్రయోజనాల కోసమే ప్రతిపాదిస్తున్నట్లయితే భారత ప్రభుత్వం దేశంలోని ప్రధాన కార్మిక సంఘాలతో చర్చించి వాటి ఆమోదం మేరకే మార్పులు చేయాలి. కానీ ఏకపక్షంగా పరిశ్రమల అధిపతులకు పెట్టుబడుదారులకు దానోహం గా ఉన్న నూతన కోడ్లను అంగీకరించేది లేదు. శాశ్వత, టెంపరరీ, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ తదితర ఏ ఉద్యోగికి వేతనాలు, అలవెన్సులు, భద్రతా రక్షణలు లేదా సంక్షేమ ప్రయోజనాల్లో తగ్గింపు ఉండదని స్పష్టమైన హామీ నూతన లేబర్ కోడ్ లలో లేని కారణంగా భారత కార్మిక వర్గం దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని అందువల్ల, నూతన కార్మిక కోడ్లు సింగరేణి ఉద్యోగులపై మాత్రమే కాక దేశంలోని అన్ని వర్గాల కార్మికులపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం చూపే అవకాశమున్న కారణంగా ఈ కోడ్ అమలును తిరస్కరిస్తూ ఉద్యోగుల ప్రయోజనాలను రక్షించేందుకు గత 29 కార్మిక చట్టాల అమలుకు తగిన చర్యలు తీసుకుంటారని. లేని పక్షంలో కార్మిక వర్గ ప్రయోజనాల సంరక్షణ కోసం కార్మిక సంఘ ప్రతిఘటనను యాజమాన్యాలు ప్రభుత్వాలు ఎదుర్కోక తప్పదని విజ్ఞప్తి చేస్తున్నాము అనీ వారు అన్నారు. అట్లనేజేఏసీ సంఘాల ఆధ్వర్యంలో రేపు 25 తేదీన అన్ని గనుల డిపార్ట్మెంట్లలో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపడతామని, 26 తేదీన సాయంత్రం 4 గంటలకు జేఏసీ ఆధ్వర్యంలో నల్ల జెండాలతో ధర్నా కార్యక్రమం నిర్వహించి మెమోరాండం ఇవ్వడం జరుగుతుంది.. అనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రెటరీ ఎండి అక్బర్ ఆలీ, పిట్ సెక్రటరీలు మీనుగు లక్ష్మీనారాయణ, గొల్ల శ్రీనివాస్, పిట్ కమిటీ ఉపాధ్యక్షులు కొండపల్లి నరసయ్య, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ బదుల వెంకటేష్, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్లు కృష్ణ చారి,రాజ్ కుమార్, ఏరియా నాయకులు సురమల్ల వినయ్ కుమార్ కమిటీ సభ్యులు దేవులపల్లి శ్రీనివాస్, రాజ కొమురయ్య, నీలయ్య, సాగర్, రాయలింగు, తిరుపతి, నరేందర్, అంజద్ ఖాన్, కార్యకర్తలు కార్మికులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలను పెంపునకు కృషి

### ఇంచార్జి మంత్రి జూపల్లి

నిర్మల్ బ్యూరో, నవంబర్24,(జనంసాక్షి) సోన్ మండలం లెఫ్ట్ పోచంపాడు గ్రామంలోని బాలికల ప్రభుత్వ సాంఘిక సంక్షేమ పాఠశాల-కళాశాలలో 13.50 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలను రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేష్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు.ఈసందర్భంగా ప్రయోగశాలను పరిశీలించిన మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించేందుకు ల్యాబ్లు ఎంతో దోహదం చేస్తాయని తెలిపారు. ఉపాధ్యాయులు ల్యాబ్ను సమర్థంగా వినియోగించి విద్యార్థుల విజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, సైన్సుపై ఆసక్తి పెంచేందుకు, ప్రయోగాత్మక విద్య అందించేందుకు ఈ ల్యాబ్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పాఠశాల మౌలిక సదుపాయాల అభివృద్ధికి 30 లక్షల రూపాయల పనులను కూడా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంజుమాండ్ అలీ,నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ్ భీంరెడ్డి, డి ఈ ఓ భోజన్న, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# జెండా వెంకటాపూర్ సొసైటీ ద్వారా బీమా చెక్కు పంపిణీ

లక్షెట్టిపేట నవంబర్ 24, (జనంసాక్షి) : మృతుడి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేసిన పీఏసీఎస్. ఛైర్మన్ తిప్పని లింగయ్య, లక్షెట్టిపేట మండలం లోని ఉత్కూరు గ్రామానికి చెందిన ముస్క శంకర్ ఇటీవల అనారోగ్యం తో మరణించారు. కాగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం జెండా వెంకటాపూర్ హెడ్ క్వార్టర్ లక్షెట్టిపేట లో మృతుడు పంట రుణం తీసుకోగా అతని పేరిట భీమా కంపెనీ కి సొసైటీ వారు ఇన్సూరెన్స్ కట్టడం తో రూ.2 లక్షల ఇన్సూరెన్స్ మంజూరు అయింది. దీంతో సోమవారం పీఏసీఎస్. జెండా వెంకటాపూర్ సంఘం చేత పీఏసీఎస్. ఛైర్మన్ తిప్పని లింగయ్య, వైస్-ఛైర్మన్ కాసు సురేష్, ఏ.డి.సి.సి.బ్యాంక్ మేనేజర్ నరేష్ , పి.ఏ.సి.ఎస్. సీఈవో విష్ణువర్ధన్ రావు చేతుల మీదుగా మృతుడి కుటుంబ సభ్యురాలు ముస్క లత కు రెండు లక్షల చెక్కును పంపిణీ చేశారు.

# లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు



శ్రీరాంపూర్ (జనంసాక్షి) : కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లు గా అమలుచేయడాన్ని నిరసిస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని సింగరేణి ఐక్య కార్మిక సంఘాల నాయకులు తెలిపారు.శ్రీరాంపూర్ నస్పూర్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ నరేంద్ర మోదీ రెండోసారి ప్రధానమంత్రి అయిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్నారని అన్నారు.సుదీర్ఘ పోరాటాలు చేసి సాధించుకున్న కార్మికుల హక్కులు లేబర్ కోడ్ ల వలన కార్మికులు అనేక హక్కులు కోల్పోవడం జరుగుతుందని, యూనియన్లు 51 శాతం ఓట్లు సాధించుతేనే గుర్తింపు హోదా పొందడం జరుగుతుందని పేర్కొన్నారు.నిరసనగా 25 న గనులపై ప్రతుల దహనాలు,నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరవడం,26న కలెక్టరేట్,జీఎం కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఐక్య కార్మిక సంఘాల నాయకులు టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి,సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్,ఐ ఎన్ టి యు సి ఏరియా వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో పేద ఆటో డ్రైవర్

### ఆదుకోవాలని వేడుకోలు





బెల్లంపల్లి, నవంబర్ 24, (జనంసాక్షి) : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఆటో డ్రైవర్ ను ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన కంబాల రాజేష్ తీవ్రంగా గాయపడి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టడుతున్నాడు. ప్రాణాపాయ స్థితిలో కరీంనగర్ ఓఎన్ఈ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తలలో రక్తం గడ్డకట్టింది, తక్షణమే ఆపరేషన్ చేయాలని, ఆపరేషన్ కు ఏ పాజిటివ్ రక్తం కూడా కావాలని వైద్యులు తెలిపారు. రెక్కాడితే కాని డొక్కాడని పేద బతుకులు ఆపరేషన్ కోసం లక్షల రూపాయలు చెల్లించే పరిస్థితి లేదు. దయగల దాతలు ముందుకు వచ్చి పేదింటి ఆటో డ్రైవర్ కంబాల రాజేష్ ను ఆదుకోవాలని ఆపేద కుటుంబం ఆశగా ఎదురు చూస్తుంది. దాతలు పంపాల్సిన నెంబర్ 9160121698 గన్న సతీష్‌కు ఫోన్ పే లేదా గూగుల్ పే ద్వారా అందించాలని వేడుకుంటున్నారు.

జనంసాక్షి

## రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి



చెన్నూర్ నవంబర్ 24 (జనం సాక్షి) : మంచిర్యాల జిల్లా, కోటపల్లి మండలం ఆల్గాం గ్రామానికి చెందిన కుమ్మరి రాజయ్య తన భార్య, కుమారుడు సాత్విక్‌తో కలిసి ఓ వివాహానికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నారు. ఆ సమయంలో కత్తెరసాల దగ్గర లారీ వారి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాజయ్యకు, ఆయన భార్యకు స్వల్ప గాయాలు అయ్యాయి. వెంటనే 108 సిబ్బంది వచ్చి వారిని ఆస్పత్రికి తరలించారు. రాజయ్య కుమారుడు సాత్విక్ మాత్రం అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## గురుకుల పాఠశాలలో విద్యార్థులపై పీఈటీ టీచర్ దాడి



**రామకృష్ణాపూర్, నవంబర్ 24(జనంసాక్షి) :** ఆర్కేపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పీఈటీ టీచర్ ఆభరణం పోయిందని అనుమానంతో ఇద్దరు విద్యార్థినులను విచక్షణారహితంగా కొట్టడంతో కలకలం రేగింది. విద్యార్థుల చేతులు, కాళ్లపై గాయాలు అయ్యాయి. తల్లిదండ్రులు పాఠశాల ఎదుట ఆందోళన చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలపై జోనల్ ఇన్చార్జ్ గిరిజా తదితరులు విచారణ నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ప్రశ్నించి నివేదికను కలెక్టర్‌కి అందజేస్తామని అధికారులు వెల్లడించారు.

## ప్రీ మెట్రిక్ స్కాలర్షిప్‌లపై అవగాహనా సదస్సు

### ఎమ్మార్వో నాగ భవాని



**గూడూరు,నవంబర్ 24(జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ఎస్సి విద్యార్థుల కోసం 5వ, తరగతి నుండి 10వ,తరగతి వరకు ప్రీ మెట్రిక్ స్కాలర్షిప్ పై ఎమ్మార్వో నాగ భవాని అవగాహనా సదస్సు నిర్వహించారు. సోమవారం గూడూరు మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తహసిల్దార్ నాగ భవాని అధ్యక్షతన సమావేశం జరిగినది.ఈసమావేశంలో వక్తలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 5వ, తరగతి నుండి 10వ,తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఎస్సి బాలుర విద్యార్థులకు సం,, రానికి 1000,బాలికలకు 1500రూపాయలు, 9వ,10వ,ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న ఎస్సి విద్యార్థులకు డే స్కాలర్లకు ప్రభుత్వం సమకూర్చుతున్న ప్రీ మెట్రిక్ 3500,హాస్టల్స్ కు 7000 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు.

ఈ స్కీమ్ కి సంబంధించిన అర్హతలు..

ఆదాయం ధృవీకరణ పత్రం 5 నుండి 8 తరగతుల వారికి 2,00,000,మరియు 9 నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 2,50,000,ఆదాయం లోపు ఉండవలెను ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం,బ్యాంక్ అకౌంట్,పైన పేర్కొన్న ధ్రువపత్రములతో విద్యార్థులు చదువుతున్న స్కూలుకు కేటాయించిన లాగిన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని,ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలేనని,మండల విద్యాశాఖ అధికారి తెలిపారు.ఇతర వివరములకు http:Telangana pass.cgg.gov.in సందర్శించవలెనని తెలిపారు. ఈ సమావేశంలో మండల విద్యాధికారి రవి కుమార్, హెచ్ డబ్ల్యూ ఓ'ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు భద్రతకు మందమర్రి పోలీసుల ముందడుగు

### పిచ్చి మొక్కల తొలగింపులో ప్రజల భాగస్వామ్యం

**రామకృష్ణాపూర్, నవంబర్ 24(జనంసాక్షి):** మందమర్రి పోలీసులు రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా సారంగపల్లి–చిర్రకుంట బీటీ రోడ్డు ఇరువైపులా విస్తరించిన పిచ్చి మొక్కలను తొలగించారు. రహదారి వెడల్పు తగ్గిపోవడం, ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించకపోవడం వంటి సమస్యలను గుర్తించిన ఎస్సై రాజశేఖర్ ప్రత్యేక చొరవతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఎస్సైతో పాటు స్థానిక ప్రజలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోలీసులకు సహకరించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ పిచ్చి మొక్కలు తొలగించడంతో రహదారి పూర్తిగా అందుబాటులోకి వచ్చి ప్రమాదాల నివారణకు దోహదం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో భాగస్వామ్యమైన గ్రామ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హెల్మెట్–సీట్‌బెల్ట్ తప్పనిసరని, నిర్ణీత వేగ పరిమితులు పాటించడం, మద్యం సేవించి వాహనం నడపకూడదని, అవసరమైన పత్రాలు వెంట ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రజల భద్రత కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తారని, రోడ్డు నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్సై రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు.



## పేదల గృహ సాధన లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుంది

### మంత్రి జూపల్లి కృష్ణారావు

**నిర్మల్ రూరల్,నవంబర్ 24(జనం సాక్షి) :** పేదల గృహ సాధన లక్ష్యంగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని రాష్ట్ర ప్రొహిబిషన్,ఎక్సైజ్ శాఖ,జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు.సోమవారం భైంసా మండలం ఎగ్గాం గ్రామంలోని ఖండిక కవిత,ధర్మ పాల్ దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను మంత్రి,అదిలాబాద్ పార్లమెంటు సభ్యులు గోడం నగేష్, ముధోల్,ఖానాపూర్ శాసనసభ్యులు రామారావు పటేల్,వెడ్మ బొజ్జు పటేల్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ లతో తో కలిసి ప్రారంభించారు.అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ఇండ్లు లేని పేదలందరికీ సొంత ఇంటి కలను నెరవేర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఇంటిలేని పేద కుటుంబాల కోసం ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ప్రతి అర్హ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా మంత్రి,ప్రజాప్రతినిధులు లబ్ధిదారులను శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్,అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యం అంటేనే పేదల రాజ్యం

### 18సం.లు నిండిన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరలు అందజేస్తాం

### ఇందిరమ్మ చీరల పంపిణి కార్యక్రమాన్ని ప్రారంభించిన మానుకోట ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీ నాయక్



**గూడూరు, నవంబర్ 24(జనంసాక్షి) :** ఇందిరమ్మ రాజ్యం అంటేనే పేదల రాజ్యమని,ఇందిరమ్మ పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందని మానుకోట ఎమ్మెల్యే భూక్యా మురళీ నాయక్ అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టత్మాకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ చీరల పంపిణి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కు మహిళలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. అనంతరం మహిళలకు చీరలను పంపిణి చేశారు. అనంతరం ఇందిరమ్మ చీరలను అందుకుంటున్న అక్కా చెల్లెల్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర మహిళలందరికి ఒక అన్నగా మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మన కోటి మంది ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలను పంపిణి చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు నాణ్యమైన చీరలను అందించటం వలన మాకు గౌరవం పెరుగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో బతుకమ్మ పేరుతో నాసిరకం చీరలను అందజేశారని విమర్శించారు. మహిళలపై నిజమైన ప్రేమ ఎవరికి ఉన్నదో మీరే గుర్తుచుకోవాలని హితవు పలికారు.ఇందిరమ్మ రాజ్యం అంటేనే పేదల రాజ్యమని, ప్రధానమంత్రిగా ఇందిరమ్మ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందని, ఇందిరమ్మను ఆదర్శంగా తీసుకొని మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో మహిళల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే కుటుంబాలతో పాటుగా,రాష్ట్రం,దేశం కూడా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,500 రూపాయలకే గ్యాస్ సిలిండర్,పేదలకు 200 యూనిట్ల వరకు కరంటు రేవంత్ సారథ్యం లోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని తెలియజేశారు. మహబూబాబాద్ నియోజకవర్గంలో 4500 ఇందిరమ్మ ఇళ్లను కూడా మహిళల పేరు మీదనే మంజూరు చేస్తున్నామని, రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలన్నదే ప్రభుత్వం లక్ష్యమన్నారు.ఏ పండుగలకో సన్న బియ్యం తినకూడదనే ఉద్దేశంతో ప్రతి పేదవాడికి ప్రతి నెల 6 కిలోల సన్నబియ్యం రేషన్ షాపుల ద్వారా ఇస్తున్నామని తెలిపారు. హాస్టల్ పిల్లలకు డైట్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలను పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీ సంస్థకు అద్దె బస్సులు ఇప్పించడం, పెట్రోల్ పంపుల నిర్వాహణ, ధాన్యం కొనుగోలు,రైస్ మిల్లుల ఏర్పాటు వంటి అనేక వ్యాపారాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.ఇందిరా శక్తి క్యాంటీన్ల ఏర్పాటు, పాఠశాలల్లో బాలికల కు స్కూళ్లు తెరిచిన వెంటనే స్కూల్ డ్రెస్సులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో నాగ భవాని, ఎంపీడీఓ సత్యనారాయణ, ఏపీఎం వీరయ్య, వెలుగు అధ్యక్షురా లు బొల్లికొండ మయూరి, నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల నరేష్ రెడ్డి, పీడీ శ్రీనివాస్,ఏఓ అబ్దుల్ మాలిక్, మండల పార్టీ అధ్యక్షులు చిట్టె వెంకన్న, వాంకు డోత్ కొమ్మాలు,బీరం శ్రీపాల్ రెడ్డి,బూడిగే సతీష్ గౌడ్,అగ్రేం వీరాస్వామి,బొల్లికొండ మధు, చంటి స్వామి,ఎండీ రసూల్,మహిళలు,జిల్లా నాయకులు,మండల నాయకులు,మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలు కేవలం ఓటుబ్యాంకు మాత్రమేనా..?

### సర్పంచ్ లుగా, వార్డుమెంబర్లుగా ఉండకూడదా..?
### బీసీజేఏసీ కన్వీనర్ కట్ల విష్ణు



గూడూరు,నవంబర్ 24(జనంసాక్షి): గూడూరులో బీసీ లు కేవలం ఓటు బ్యాంకు మాత్రమేనని బీసీ జేఏసీ కన్వీనర్ కట్ల విష్ణు అన్నారు.తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ పిలుపు మేరకు,సోమవారం గూడూరు మండల బీసీ జేఏసీ ఆధ్వర్యంలో గూడూరు మండల బీసీ నాయకులు మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని జిల్లా జేఏసీ నాయకులతో కలిసి,స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో ని కలిసి ప్రభుత్వం విడుదల చేసిన స్థానిక సంస్థల రిజర్వేషన్ జిఓనెం 46 బీసీల గొంతును తడిగుడ్డతో కోసిందని,ఆ జిఓ వల్ల గూడూరు మండలంలో ఒక్క గ్రామపంచాయితీ కూడా బీసీలకు కేటాయించలేదని, గ్రామాలల్లో వార్డుమెంబర్ కూడా బీసీలకు రాలేదని,ఈ జిఓనెం 46 బీసీల నాయకత్వం పట్ల గుడిబండగ,ఉరితాడుగా మారిందని,జనాభా దామాషా ప్రకారం బీసీలకు కనీసం 5 గ్రామ పంచాయతీలైన రిజర్వ్ కావాలి కానీ,కనీసం ఇక్కడ వార్డుమెంబెర్ కే దిక్కులేని పరిస్థితి ఉందని,కావున బీసీలకు జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, న్యాయం చేయాలని విన్నవించడం జరిగింది, సానుకూలంగా స్పందించిన అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో ఇట్టి విషయాలపై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. బీసీజేఏసీ కన్వీనర్ కట్ల విష్ణు మాట్లాడుతూ.. ప్రభుత్వం జిఓనెం 46 వల్ల మండలంలో బీసీల ఉనికి పూర్తిగా కనుమరుగవుతుందని, రిజర్వేషన్ చేసిన విధానం జనాభా దామాషాకు విరుద్ధంగా ఉందని,ప్రభుత్వం జిఓ రద్దు చేసి,అఖిలపక్షం ఏర్పాటు చేసి,రాబోయే శీతాకాల పార్లమెంట్ సమావేశాల ముందు ప్రధానిని కలిసి,రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్లో చేర్చేవిధంగా ఒత్తిడిచేసి,తర్వాత ఎన్నికలకు వెళ్లి బీసీల పట్ల చిత్తశుద్ధి నిరూపించుకోవాలని,లేదంటే తెలంగాణ తరహా ఉద్యమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం చవిచుడాల్సివస్తుందని డిమాండ్ చేశారు ఈకార్యక్రమంలో జిల్లా నాయకులు వేముల వెంకన్న, ముంజాల రాజేందర్,గండి వీరేందర్,సట్ల ప్రభాకర్, మండల జేఏసీ నాయకులు నూకల సురేందర్,నూకల ఉపేందర్,నామని సదానందం, ఆవుల అశోక్,ముంజాల యాకయ్య,వాడిక వెంకన్న,పోతరాజు రవి,వంగపండ్ల మల్లేష్, మండల మల్లేష్ పాల్గొన్నారు.

# సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్ల ప్రక్రియ పున:పరిశీలన

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి ,నవంబర్ 24, (జనంసాక్షి) :** రాజ్యాంగ నిబంధన, తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ చట్టం, జనాభా ప్రాతిపదికన ప్రకారం ఎస్.సి., ఎస్.టి. రిజర్వేషన్ వారి జనాభా సంఖ్య కంటే తక్కువగా ఉండకూడదని, అదే విధంగా మొత్తం రిజర్వేషన్స్ 50 శాతానికి మించకూడదని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికలు 2025 సందర్భంలో బి.సి. డెడికేషన్ కమిషన్ నివేదిక ఆధారంగా జిల్లాలోని సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు రిజర్వేషన్ల ప్రక్రియ పునః పరిశీలన చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని 306 గ్రామపంచాయతీలు, 2 వేల 680 వార్డు సభ్యుల స్థానాలకు ప్రభుత్వ ఉత్తర్వులలో పేర్కొన్న నియమావళి ప్రకారం రిజర్వేషన్ ప్రక్రియ పునః పరిశీలన చేయడం జరిగిందని తెలిపారు. భీమారం మండలంలో ఎస్.సి. 30.2 శాతం, ఎస్.టి. 20.15 శాతం (మొత్తం 50.35 శాతం) బి.సి. 0, కాసిపేట మండలంలో ఎస్.సి. 21.06 శాతం, ఎస్.టి. 29.40 శాతం (మొత్తం 50.46 శాతం), బి.సి. 0, కోటపల్లి మండలంలో ఎస్.సి. 37.77 శాతం, ఎస్.టి. 9.63 శాతం (మొత్తం 47.4 శాతం) , బి.సి. 0, మందమర్రి మండలంలో ఎస్.సి. 33.41 శాతం, ఎస్.టి. 16.39 శాతం (మొత్తం 49.8 శాతం), బి.సి. 0, నెన్నెల మండలంలో ఎస్.సి. 29.96 శాతం, ఎస్.టి. 15.20 శాతం (మొత్తం 45.16 శాతం), బి.సి. 0, ప్రకారంగా నమూనా రిజర్వేషన్లలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు కేటాయించినట్లయితే నిబంధనల ప్రకారం 50 శాతం రిజర్వేషన్ దాటుతుందని, ఈ కారణంగా వెనుకబడిన తరగతులకు (బి.సి.లకు) రిజర్వేషన్ల కేటాయింపు జరగడం లేదని తెలిపారు. తదుపరి రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# భవన నిర్మాణ కార్మికుల బీమా పెంపు

### ప్రమాద బీమా 6 లక్షల నుండి 10 లక్షలకు పెంపు
### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, నవంబర్ 24, (జనంసాక్షి) :** భవన, ఇతర నిర్మాణ కార్మికులకు సంబంధించిన బీమా పెంచడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో మంచిర్యాల రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీనివాస్ రావు, సహాయ కార్మిక కమిషనర్ పి.నరసింహస్వామి, అధికారులతో కలిసి బీమా పెంపు సంబంధిత గోడ ప్రతులు, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... భవన, ఇతర నిర్మాణ రంగాల కార్మికులకు సంబంధించిన ప్రమాద బీమా క్రింద లబ్ధి మొత్తాన్ని 6 లక్షల రూపాయల నుండి 10 లక్షల రూపాయలకు పెంచడం జరిగిందని, సహజ మరణం క్రింద లబ్ది మొత్తాన్ని 1 లక్ష రూపాయల నుండి 2 లక్షల రూపాయల వరకు పెంచడం జరిగిందని తెలిపారు. డిసెంబర్ 3వ తేదీ వరకు మంచిర్యాల సహాయ కార్మిక శాఖ అధికారులు మండలాల వారీగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి కార్మికులకు ప్రమాద బీమా ఆవశ్యకతపై వివరించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన కార్మికులు మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రమాదవశాత్తు పూర్తి శాశ్వత అంగవైకల్యం కలిగిన వారికి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం, ప్రమాదవశాత్తు పాక్షిక శాశ్వత అంగవైకల్యం కలిగిన వారికి 4 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. వివరాల కొరకు సహాయ కార్మిక అధికారి కార్యాలయాలను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక అధికారి సత్యనారాయణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రూపు రాజకీయల మధ్య నలుగుతున్న వీవోఏలు

### ఇందిరమ్మ చీరల పంపిణీలో ఆధిపత్యం పోరు

**బెల్లంపల్లి, నవంబర్ 24, (జనంసాక్షి) :** ఇందిరమ్మ చీరల పంపిణీలో ఆధిపత్య పోరుతో గ్రూపు రాజకీయాలు భగ్గు మంటున్నాయి. కాంగ్రెస్ పార్టీలోని గ్రూపు రాజకీయాల వల్ల వీవోఏలు నలిగి పోతున్నారు. బెల్లంపల్లి నియోజకవర్గంలోని ఒక మండలంలో రెండు గ్రూపులు చీరల పంపిణీలో తమ వర్గానికే సమాచారం ఇవ్వాలని, మా మనుషులే వచ్చి చీరలు పంచుతారని ఆదేశించాగా మరో వర్గం నాయకులు ముందుగానే చీరల పంపిణీ వద్దకు వెళ్లి తామే చీరలు పంచుతాం, ఇంకా ఎవరిని పిలవాల్సిన అవసరం లేదంటూ వీవోఏలపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో ఇందిరమ్మ చీరల పంపిణీ పథకం కాస్త రాజకీయ ఆధిపత్య పోరుకు ఊతం ఇస్తున్నట్లు అయింది. వీవోఏలకు బెదిరింపులు కూడా రావడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఒకరికి చెప్తే మరొకరి కోపం, చెప్పక పోయినా తిప్పలే, పోనీ నాయకులను పిలవకుండా పంపిణీ చేద్దామని అనుకుంటే ఇంకా ఎంత రచ్చ జరుగుతుందోనని మదనపడుతున్నారు. ఇంకా కొందరు నాయకులైతే ఏకంగా మీరు బిఆర్ఎస్ పార్టీ మనుషులు, మా పార్టీకి మీరు సపోర్ట్ చేయడం లేదని అంటూ మరో విధమైన ఒత్తిడి తెస్తున్నారు. చిన్న జీతగాళ్ళం, మాకు పార్టీలతో పనేంటి. ప్రభుత్వ ఆదేశాలను పాటించి అమలు చేసే మాలాంటి చిన్న జీతగాళ్లపై నాయకులు ఇలా ఒత్తిడి పెంచడం సరికాదని వీవోఏలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ ఎన్నికల సంరంభం ఆరభం కావడంతో కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలు ఎక్కడికి తీరం చేరుతాయో వేచి చూడాల్సిందే.

## నూతన లేబర్ కోడ్స్‌పై అవగాహన కార్యక్రమం




**శ్రీరాంపూర్ (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన నాలుగు నూతన లేబర్ కోడ్స్ పై అవగాహన కార్యక్రమాన్ని డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ మెకానికల్ దిలీప్ కుమార్,అంకిత్ సింగ్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ సింగరేణి ఉపరితల గనిలో సోమవారం నిర్వహించారు.ఈ సందర్భంగా డిడిఎంఎస్ అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న 29 కార్మిక చట్టాలను ఏకీకృతం చేస్తూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నాలుగు లేబర్ కోడ్స్ ను నవంబర్ 21 నుండి అమల్లోకి వచ్చినట్లు తెలిపారు.కార్మికుల సంక్షేమం,హక్కులు, భద్రత,వేతన నిర్మాణం,పారదర్శక ఉద్యోగ వ్యవస్థను బలోపేతం చేయడమే కోడ్స్ లక్ష్యమని తెలిపారు.కొత్త లేబర్ కోడ్స్ ను సరిగ్గా అర్థం చేసుకుని అమలు చేయడం కార్మికులకు,యాజమాన్యానికి సమానంగా అవసరమని పేర్కొన్నారు.సమావేశంలో బిఎంఎస్ మినహా అన్ని యూనియన్లు కొత్త లేబర్ కోడ్స్ అమలును వ్యతిరేకించాయి. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ చిప్ప వెంకటేశ్వర్లు, గుర్తింపు సంఘం నాయకులు బాజీ సైదా,డీజిఎం పర్సనల్ ఎస్ అనిల్ కుమార్,ఏరియా రక్షణాధికారి విజయ్ కుమార్,ప్రాజెక్ట్ ఇంజనీర్ నాగరాజు,డివైపిఎం కిరణ్ కుమార్,ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్,వివిధ గనుల మేనేజర్లు,అధికారులు,ఉద్యోగులు,కాంట్రాక్ట్ సిబ్బంది,,యూనియన్ ప్రతినిధులు,సీఎంఓఏఐ సభ్యులు పాల్గొన్నారు.

## పిడీఎస్‌యూ జిల్లా మహాసభల పోస్టర్ల విడుదల



**బెల్లంపల్లి, నవంబర్ 24, (జనంసాక్షి) :** పిడీఎస్యూ జిల్లా మహాసభల పోస్టర్లను సోమవారం బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విడుదల చేశారు. ఈసందర్భంగా పిడీఎస్యూ నాయకుడు రెడ్డి చరణ్ మాట్లాడుతూ ఈ నెల 26, 27తేదీలలో జరిగే పిడీఎస్యూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 1970లో జార్జిరెడ్డి ప్రేరణతో పిడీఎస్యూ ఆవిర్భవించిందని అన్నారు. ఐదు దశాబ్దాల కాలంగా దేశంలో శాస్త్రీయమైన, సమానమైన విద్య విధానం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ మహోజ్వలమైన చరిత్రను నిర్మించిందన్నారు. నేడు దేశంలో ప్రజాస్వామ్యం తీవ్రమైన సంక్షోభ దశలో ఉందని, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజం రోజురోజుకు తీవ్రమైపోతున్నదన్నారు. దేశ పౌరుల భవిష్యత్తు చాలా ఆందోళనకరంగా మారిపోతుందన్నారు. మానవ సంబంధాలన్నీ కూలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిడీఎస్యూ నాయకులు ఆదిత్య, రాజు, ప్రవీణ్, అంజన్న, సాయి, శశికుమార్ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## సమరశీల పోరాటాలకు కార్మికవర్గం సిద్ధం కావాలి

### ఏఐటీయూసీ పిలుపు



**బెల్లంపల్లి, నవంబర్ 24, (జనంసాక్షి) :** సమరశీల పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధం కావాలని ఏఐటీయూసీ పిలుపునిచ్చింది. సోమవారం బెల్లంపల్లి శాంతిఖని వద్ద లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, ఫిట్ సెక్రటరీ దాసరి తిరుపతి గౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన కొత్త లేబర్ కోడ్ల వల్ల కార్మికులకు ఎంతో అన్యాయం జరుగుతుందని, ఈ కొత్త కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలోనూ కార్మిక వ్యతిరేక విధానాలపై ఏఐటియుసి చేసిన పోరాటాల చరిత్రను గుర్తు చేశారు. గనిలోని పలు సమస్యలపై చర్చించిన అనంతరం మేనేజర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి యాజమాన్యానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ మంతెన రమేష్, రత్నం ఐలయ్య, వర్క్మెన్ ఇన్స్పెక్టర్లు మిట్టపల్లి రమేష్, మైన్స్ కమిటీ సభ్యులు రత్నం ప్రవీణ్, మహంకాళి సంతోష్, రామక్రిష్ణ, శ్రీకాంత్, సేఫ్టీ కమిటీ సభ్యులు క్యాంటీన్ కమిటీ సభ్యులు, టెంపుల్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెడ్మ బొజ్జు

### శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



**సారంగాపూర్ నవంబర్ 24(సారంగాపూర్) :** నిర్మల్ జిల్లా కేంద్రం లోని ఐబీ గెస్ట్ లో నూతనంగా ఎన్నికైన నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ (DCC) అధ్యక్షుడు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ను కాంగ్రెస్ నాయకులు సోమవారం శాలువాతో సన్మానించి పుష్ప గుచ్చాము అందించారు.ఈ సందర్భంగా నిర్మల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాల్సిందిగ కోరారు. ఈ కార్యక్రమం లో మాజీ మంత్రి అల్లోల ఇంద్ర కరణ్ రెడ్డిగారు, మాజీ జెడ్పిటిసి ఫోరం అధ్యక్షులు పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి నిర్మల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ అర్జుమాంద్ అలీ, నిర్మల్ జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అహ్మద్ ముక్తార్ సారంగాపూర్ మండల సోషల్ మీడియ కో ఆర్డినేటర్ సాక్ పెల్లి సురేందర్, సారంగాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు దశరథ్ రాజేశ్వర్, అడెల్లి రాజేశ్వర్ రావు, ఉట్ల రాజేశ్వర్, ఓలత్రి నారాయణ రెడ్డి, ఇస్మాయిల్ తదితరులు ఉన్నారు.

## టైలరింగ్ ,డ్రాయింగ్ పరీక్షల ఫీజు డిసెంబర్ 5లోపు చెల్లించాలి

### డిఈఓ దర్శనం బోజన్న

**నిర్మల్ బ్యూరో, నవంబర్24,(జనంసాక్షి)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం ద్వారా నిర్వహించే టైలరింగ్ ,డ్రాయింగ్ పరీక్షల కొరకు ఆసక్తిగల అభ్యర్థులు ఫీజును డిసెంబర్ 5 లోపు చెల్లించాలని నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న తెలిపారు. ఈ పరీక్షలు జనవరి ,ఫిబ్రవరి 2026లో నిర్వహించబడతాయని వెల్లడించారు. డ్రాయింగ్ లోయర్ గ్రేడ్ కు ఫీజు రూ. 100 , హయ్యర్ గ్రేడ్ కు ఫీజు 150, టైలరింగ్ ఎంబ్రాయిడింగ్ కు ఫీజు100, టైలరింగ్ హయ్యర్ గ్రేడ్ కు ఫీజు 200చెల్లించాలని తెలిపారు. అభ్యర్థులు కనీసం ఏడో తరగతి ఉత్తీర్ణులై ఆయా అంశాలలో శిక్షణ పొందిన వారు అర్హులని పేర్కొన్నారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి టెక్నికల్ కోర్స్ సర్టిఫికేట్ జారీ చేయబడుతుందని వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు www.bse.telangana.gov.in వెబ్సైట్లో దరఖాస్తు చేసుకొని, దాని హార్డ్ కాపీలను జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలియజేశారు. వెబ్సైట్లో చూపిబడిన హెడ్స్ పై అభ్యర్థులు బ్యాంకులో చలాన్ ద్వారా ఫీజు చెల్లించాలని డిడిలు గాని ఇతరత్రా గాని అంగీకరించబడవని చెప్పారు

## దిందా బ్రిడ్జికి అనుమతులు



**చింతలమనేపల్లి నవంబర్ 24(జనంసాక్షి )** మండలకేంద్రంలోని దిందా గ్రామీనికి వెళ్లేవారు బ్రిడ్జి కీ అనుమతులు పూర్తి బీజేపీ మండల అధ్యక్షులు డొకె రామన్న తెల్పిన వివరాల ప్రకారం గతంలో 3 కోట్లతో ఈ బ్రిడ్జి మంజూరు కాగా అటవీ అనుమతులు లేక ఇన్ని రోజులు బ్రిడ్జి పనులను ఎవరుకూడా పరంభించలేదు మన సిర్పూర్ ఎమ్మెల్య పల్వాయి హరీష్ బాబు చొరవ తీసుకొని అటవీ మరియు వివిధ అనుమతులను పూర్తి చేపించి ఈరోజు పనులకు ప్రారంభించడం జరిగిందని తెలిపారు ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న బ్రిడ్జి పనులు ప్రారంభించడానికి సహకరించిన ఎమ్మెల్య కు దిందా గ్రామస్థులు ధన్యవాదములు తెలియచేస్తూ కాంట్రాక్టర్ మదన్ మోహన్ రావు రవీందర్ రావు తో కలిసి బ్రిడ్జి పనులను ప్రారంభించిన గ్రామస్థులు ఈ కార్యక్రమం ఎలములే మల్లయ్య దాగె అంకులు డొకె చెంద్రయ్య లచ్చన్న రవి వెంకటేష్ గ్రామస్థులు పాల్గొన్నారు

## డబుల్ బెడ్రూం ఇళ్లు ఆక్రమించిన వారిపై కేసు

**తొర్రూరు, నవంబర్ 24 (జనం సాక్షి):** తొర్రూరు పట్టణం గోపాలగిరి రోడ్డులోని డబుల్ బెడ్రూం ఇళ్లు ఆక్రమించిన వారిపై కేసు నమోదు చేసినట్లు తోరూర్ ఎస్సై జి .ఉపేందర్ తెలియజేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం తొర్రూరు పట్టణంలోని గోపాలగిరి రోడ్డులో 280 ఇండ్లు ప్రభుత్వం నిర్మించగా, ఇండ్లలోకి ఎలాంటి ప్రొసీడింగ్ పత్రాలు లేకుండా పలువురు అనుమతి లేకుండా ఇండ్లలోకి అక్రమంగా ప్రవేశించడంతో స్థానిక తహసిల్దార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగింది.కేసులు నమోదైన వారిలో సిపిఎం నాయకులు బొల్లం అశోక్, ఎండి యాకూబ్, కొమ్మనబోయిన యాకయ్య, డొనుక దర్గయ్య, మార్క సాంబయ్య లు ఉన్నారు. అనుమతి లేకుండా, ప్రొసీడింగ్ పత్రాలు లేకుండా ఎవరైనా అనధికారికంగా ఇండ్లలోకి చొరబడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

## మామునూర్ ఇన్స్పెక్టర్గా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



**వరంగల్ ఈస్ట్, నవంబర్ 24 (జనం సాక్షి) :** మామనూర్ పోలీస్ స్టేషన్కు కొత్త ఇన్స్పెక్టర్ గా శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఇక్కడ ఇన్స్పెక్టర్గా పనిచేసిన రమేష్ బదిలీ కాగా శ్రీనివాస్ ఆస్థానంలో ఇన్స్పెక్టర్గా బాధ్యతలు స్వీకరించారు. 2012 బ్యాచ్కు చెందిన శ్రీనివాస్ ఇప్పటివరకు జనగాం, రఘునాథపల్లి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్గా బాధ్యతలు నిర్వర్తించారు. అంతకుముందు వరంగల్ కమిషనరేట్ పరిధిలో అనేక పోలీస్ స్టేషన్లలో సబ్ ఇన్స్పెక్టర్గా సమర్థవంతంగా సేవలు అందించారు. ప్రజాసేవ పట్ల నిబద్ధత, చట్ట-వ్యవస్థ పరిరక్షణలో కృతనిశ్చయంతో పనిచేసే అధికారిగా శ్రీనివాస్ పేరుపొందారు.మామనూర్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనకు పోలీస్ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, స్థానికులు శుభాకాంక్షలు తెలిపారు.



## దొడ్డి దారిన ఎవ్వరు రాలేదు.. రాజ్యాంగబద్ధంగానే గిరిజనులము

**నెరడిగొండ నవంబర్ 24(జనంసాక్షి) :** అధికార పార్టీలో ఉండి విభజించు పాలించు అనే ఎత్తుగడలో భాగంగా నడిపిస్తున్న ప్రభుత్వాలు ఆదివాసి లంబాడీలకు చిచ్చుపెట్టి ఘర్షణలకు దారి తీస్తున్నారని,తమ స్థాయిని మరచి ఆదివాసి పోరు సభ లో మాట్లాడిన ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు ను పార్టీ నుండి సస్పెండ్ చెయ్యాలి అని గిరిజన లంబాడీల ఐక్యవేదిక ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ డిమాండ్ చేశారు.సోమవారం రోజున ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్టీ నుండి లంబాడిలను తొలగించాలని పదే పదే చెప్పి లంబాడిల మనోభావాలను దెబ్బతిస్తునరాని, ఇప్పటికైనాప్రజాస్వామికవాదులుగా ఆలోచించాలని, లంబాడీలు కష్టపడి చదివి ఉద్యోగాలు పొందుతూనమ్మన్నారు.చటబద్దంగానే ఏస్టి జాబితాలో వచ్చామని గుర్తు చేశారు.ప్రజల ఓట్లతో గెలిచి ఆదివాసీ సమాజం వైపు మొగ్గు చూపుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే పై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వనికి డిమాండ్ చేశారు.అభివృద్ధిని పక్కన బెట్టి లంబాడిలను తొలగించాలని చెప్పుతూ మద్దతు తెలుపుతున్న అధికార పార్టీ నాయకులకు వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీ నుండి సస్పెండ్ చేయాలని కోరారు.ఇలాగే విమర్శలు పునార ఉత్తమైతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాల్సినఅవసరమేర్పడుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జ్ పాండు రాథోడ్ మండల జిల్లా నాయకులు సతీష్ అర్జున్ సునీల్ రాజు సందీప్ తదితరులు ఉన్నారు.

## నిబంధనలను పాటించని ప్రైవేట్ పాఠశాలలను మూసీ వేయాలి

### దళిత బహుజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ వినతి



**హనుమకొండ ప్రతినిధి (జనంసాక్షి) :** హనుమకొండ జిల్లా కేంద్రంలో దళితబహుజన విద్యార్థి సంఘాలఆధ్వర్యంలో హన్మకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ కి వినతి పత్రం అందజేయడం జరిగింది. హనుమకొండ జిల్లా పరిధిలో ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రభుత్వ నియమ, నిబంధనలు పాటించ కుండా, ప్రభుత్వ జీవోలను తుంగలో తొక్కుతూ, అనుమతులు పొందిన పత్రాల ప్రకారం కాకుండా స్కూల్ బోర్డులపై ఐఐటి, నీట్, డి.జి, ఒలంపియాడ్, ఇ-టెక్నో, స్మార్ట్, ఇంటర్నేషనల్ మరియు పబ్లిక్, ప్రైమ్ లాంటి తోక పేర్లు తగిలించుకొని పాఠశాలలు నడుపుతూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మోసం చేస్తూ, అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయి. ప్రశ్నించడానికి వెళ్లే విద్యార్థి సంఘాలను మరియు సామాజిక కార్యకర్తల్ని, జర్నలిస్టులపై ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు వారి ఇష్టా రీతిన దుర్భాషలాడుతూ దాడులు చేస్తున్న పరిస్థితి ఎదురవుతుంది.ప్రభుత్వాన్ని మోసం చేస్తూ నిర్వహిస్తున్న పాఠశాలలను తక్షణమే ప్రభుత్వం స్వాధీనపరుచుకోవాలి. ఆ యాజమాన్యాలపై క్రిమినల్, చీటింగ్ కేసులను నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబి ఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మంద నరేష్ సేవలాల్ విద్యార్థి సంఘము హన్మకొండ జిల్లాఅధ్యక్షులు మురళీ నాయక్ వీసకె విద్యార్థి సంఘము అధ్యక్షులు అంబాల అనిల్ నాయకులు అశోక్ విజయ్ మోహన్ ఉదయ్ కిరణ్ రాజ్ కుమార్ చరణ్ కళ్యాణ్ సాయి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాలకుర్తి నూతన తహసిల్దార్గా సరస్వతి



**పాలకుర్తి, నవంబర్ 24 (జనంసాక్షి)** పాలకుర్తి నూతన తహసిల్దార్ గా సూత్రం సరస్వతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ కార్యాలయంలో సూపరిండెంట్ గా పనిచేసిన సరస్వతిని పాలకుర్తి తహసీల్దారుగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయగా, పాలకుర్తి తహసీల్దారుగా పనిచేసిన శ్రీధర్ కలెక్టర్ కార్యాలయానికి సూపరిండెంట్ గా బదిలీ చేశారు. ఈ సందర్భంగా నూతన తాసిల్దార్ సరస్వతి మాట్లాడుతూ భూభారతిలో పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

## ఏకవీర ఎల్లమ్మ ఆలయ పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు

### వరంగల్ లోక్సభ సభ్యురాలు డా.కడియం కావ్య, పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి



**వరంగల్ ప్రతినిధి, నవంబర్ 24(జనంసాక్షి) :** ఏకవీర ఎల్లమ్మ ఆలయ పునరుద్ధరణకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవడంతో పాటు ఇందుకు అవసరమైన నిధుల మంజూరు కొరకు కృషి చేస్తామని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి కడియం కావ్య, పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డిలు తెలిపారు. సోమవారం గ్రేటర్ వరంగల్ పరిధిలోని 15 వ డివిజన్ పరిధి మొగిలిచర్ల లో ప్రసిద్ధి చెందిన ఏకవీర ఎల్లమ్మ దేవాలయంను ఎంపీ కడియం కావ్య, పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి జిల్లా కలెక్టర్ డా.సత్య శారద, రాష్ట్ర పురావస్తు శాఖ సంచాలకులు అర్జున్ రావులతో కలిసి క్షేత్ర స్థాయి లో ఆలయ నిర్మాణ వైశిష్ట్యం, పురాతన శైలి, శిల్పకళ వంటి అంశాలను పరిశీలించిన ఆలయ పునరుద్ధరణకు అవసరమైన చర్యలను తీసుకుంటామని అన్నారు. ఏంపి,ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి మంజూరు చేయిస్తామన్నారు. రానున్న 100 సంవత్సరాల దృష్టిలో ఉంచుకొని అందుకు అవసరమైన మాస్టర్ ప్లాన్ ను రూపొందించు కొని ఆలయానికి అనుబంధంగా పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని అదనంగా తీసుకొని అందులో గార్డెనింగ్ ల్యాండ్ స్కేపింగ్ చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ గతం లో సుమారు 30 విగ్రహాలను ఆలయ ఆవరణ లో ఏర్పాటు చేయడం జరిగిందని, వాటికి పీఠాలు ఏర్పాటు చేసి అమర్చడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.రాష్ట్ర పురావస్తు శాఖ సంచాలకులు అర్జున్ రావు మాట్లాడుతూ ఆలయ ప్రాచీనతను కాపాడేలా చర్యలు చేపడతామని తెలిపారు. అనంతరం ఆలయ ఆవరణలో ఎంపీ ఎమ్మెల్యే కలెక్టర్ అక్కడ ఉన్న రాతిని తొలిచి నిర్మించిన గుహలతో పాటు ఇటీవల గ్రామం నుండి సేకరించిన శిల్పాలు శాసనాలు ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని కలియ తిరిగి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మెన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి, ఆర్కియాలజీ అసిస్టెంట్ డైరెక్టర్ బుజ్జి, డి ఆర్ ఓ విజయలక్ష్మి జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ , టూర్చ్ అరవింద్ ఆర్యా తదితరులు పాల్గొన్నారు.

# ఫిట్నెస్ లేకుండా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలల బస్సులను సీజ్ చేయాలి..

**● జిల్లా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కిషోర్ బాబుకువామపక్ష విద్యార్థి సంఘాల వినతి**

హనుమకొండ ప్రతినిధి నవంబర్ 24 (జనం సాక్షి) : హనుమకొండ జిల్లాలో నిబంధనలకు భిన్నంగా ఫిట్నెస్ లేకుండా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలల బస్సులను తక్షణమే సీజ్ చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం హన్మకొండ జిల్లా కేంద్రంలోని చింతగట్టు లో గల రోడ్ ట్రాన్స్పోర్ట్ ఆఫీస్( ఆర్.టీ.ఓ)లో జిల్లా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కిషోర్ బాబు కు వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు 1 లేదా 2 బస్సులకు ఆర్టీవో ఆఫీస్



లో ఫిట్ నెస్ చెకింగ్ చేయించుకుని 4నుండి 20 వరకు ఫిట్నెస్ లేని బస్సులను యధేచ్చగా రోడ్లపై నడిపిస్తున్నాయని, కానీ ప్రైవేట్ పాఠశాలలు ఏ ఒక్క నిబంధనను కూడా పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.కొన్ని ప్రైవేట్ పాఠశాలలు తమ బస్సులను సొంత స్థలంలో పార్కింగ్ చేయకుండా రోడ్ల పైన ప్రభుత్వ స్థలాలలో బస్సులను పార్కింగ్ చేస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల బస్సుల్లో కనీసం మెడికల్ కిట్లు, అటెండెంట్, ఫైర్ సేఫ్టీ పరికరాలు లేకుండా నడుస్తున్నా యని, విద్యార్థులు కూర్చునే సామర్థ్యానికి విరుద్ధంగా అధిక లోడ్ తో విద్యార్థులను తరలిస్తున్నాయని, బస్సు డ్రైవర్లకు ఉదయం, సాయంత్రం బ్రీత్ ఎనలైజర్ తో పరీక్షలు నిర్వహించకుండా బస్సులు నడుపుతున్నారని తీవ్రంగా ఆక్షేపించారు. కనీస వేతనాల చట్టం ప్రకారం జీతాలు ఇవ్వకుండా, పిఎఫ్, ఈపీఎఫ్ లాంటి సౌకర్యాలు కల్పించకుండా మోసం చేస్తున్నరని తెలిపారు. ఈ కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పంచాయతీ ఎన్నికల్లో బీసీ వర్గానికి వర్గానికి తీవ్ర అన్యాయం

**● మాట ఇచ్చి తప్పిన రాష్ట్ర ప్రభుత్వం**

**కాటారం నవంబర్ 24 ( జనం సాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం సబ్ డివిజన్లోని ఐదు మండలాల నిర్వహించే పంచాయతీ ఎన్నికల్లో బీసీ కులస్తులకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ పేర్కొన్నారు. సోమవారం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక గతంలో ఉన్న 24 శాతం రిజర్వేషన్ కల్పించకపోవడం దారుణమని పేర్కొన్నారు. గత రెండు రోజుల క్రితం స్థానిక సంస్థల రిజర్వేషన్లు ఏడు గ్రామ పంచాయతీలు ఉన్న పలిమెల మండలంలో ఒక్క స్థానాన్ని కూడా ప్రకటించకపోవడం, 24 గ్రామ పంచాయతీలు ఉన్న మహ ముత్తారం మండలంలో ఒక స్థానంలో కూడా బీసీ రిజర్వేషన్ కల్పించకపోవడం, అలాగే 18 గ్రామ పంచాయతీలో ఉన్న మహాదేవపూర్ మండలంలో బీసీ రిజర్వేషన్ కల్పించకపోవడం బీసీ కులస్తులకు అన్యాయం చేసినట్ల అని ఆరోపించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో బీసీలకు పాత రిజర్వేషన్ ప్రకారం జరగలేదని కాంగ్రెస్ పార్టీ నాయకుల కోసం అధికారులు రిజర్వేషన్లు మార్చేశారని ఆరోపించారు. తక్షణమే జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి బీసీలకు సరైన విధంగా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.




## చెడు వ్యసనాలకు బానిసలు కావద్దు

**ఇంతేజార్గంజ్ పిఎస్ ఎస్సై సందీప్**

**వరంగల్ ఈస్ట్ నవంబర్ 24 (జనం సాక్షి) :** వరంగల్ నగర పోలీస్ కమీషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు మధ్యాహ్నం ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నరేంద్ర నగర్, హై స్కూల్ లో జాగృతి కళాబృందం చేత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సందీప్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ ఇతర చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని ఒకవేళ అమ్మిన,సేవించిన ఈ మొబైల్ నంబర్ కి 8712584473 సమాచారం అందించాలని కోరారు. సైబర్ మోసాల బారిన పడవద్దని, అలాగే చదువుపై శ్రద్ధ పెట్టాలని , రోడ్డు ప్రమాదాలు,డయల్100,షీ టీమ్స్, ఈవ్ టీజింగ్, హ్యూమన్ ట్రాఫికింగ్,గురించి వివరిస్తు తల్లితండ్రులు చెప్పిన మాట వినాలని, ఆడ పిల్లలు ధైర్యంగా ఉండాలి.అపదలలో డయల్ 100 కి కాల్ చేయాలని, సైబర్ మోసాలకు గురైతే సైబర్ హెల్ప్ లైన్ నంబర్ 1930 కి ఫోన్ చేయాలని చెప్పినారు, పలు సామాజిక అంశాలపై పోలీస్ జాగృతి కళా బృందం వారు ఆలపించిన పాటలు ప్రతి ఒక్కరిని ఆలోచింప చేసాయి. ఈ కార్యక్రమానికి ఇంతేజార్ గంజ్ ఎస్సై రోహిత్ , ఇంచార్జీ హెడ్ మాస్టర్ సరోజినీ మేడమ్ ,అధ్యాపక బృందం, హెడ్ కానిస్టేబుల్స్,బ్లూ కోట్ కానిస్టేబుల్స్ ఆఫీసర్స్,కళా బృందం సభ్యులు, హెడ్ కానిస్టేబుల్స్ ,విలియమ్,వెంకటేశ్వర్లు, రత్నయ్య,హోమ్ గార్డ్స్ శ్రీనివాస్, నారాయణ, చిరంజీవి, హై స్కూల్ స్టూడెంట్స్ బాయ్స్ గర్ల్స్ పాల్గొన్నారు.

## నిరుపేద విద్యార్థులకు అండగా నిలవాలి

తొర్రూరు , నవంబర్ 24 (జనం సాక్షి) : నిరుపేద విద్యార్థులకు ప్రతి ఒక్కరు అన్ని విధాలుగా అండగా నిలవాలని యాదవ చైతన్య వేదిక మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు బత్తుల యాకయ్య అన్నారు. పట్టణ కేంద్రంలో ఉన్న స్నేహ నివాస్ నిలయంలో చదువుకుంటున్న విద్యార్థులకు సోమవారం 50 కేజీల బియ్యం, పండ్లను అందజేశారు.ఈ సందర్భంగా యాకయ్య మాట్లాడుతూ స్నేహ నివాస్ నిలయంలో సుమారు 40 మంది పేద విద్యార్థులు చదువుకుంటున్నారని,వారికి ప్రతి ఒక్కరు అండగా నిలిచి ఆదుకోవాలని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్నేహ నివాస్ సిస్టర్స్, విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

## ఋణమార్పిడి పథకంపై అవగాహన




**మహబూబాబాద్ బ్యూరో, నవంబర్ 24(జనం సాక్షి):** మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఋణమార్పిడి పథకం పై సోమవారం అవగాహన సమావేశం జరిగింది. రైతుల్లో పెరుగుతున్న రుణభారం, అధిక వడ్డీ రుణాల సమస్యలను దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన ఈ కార్యక్రమానికి సీనియర్ న్యాయవాది మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు చెందిన మధ్యవర్తి చెన్నామల్లారెడ్డి పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్బంగా చెన్నామల్లారెడ్డి మాట్లాడుతూ ఋణమార్పిడి పథకం ద్వారా రైతులు ప్రైవేట్ దళారీల అధిక వడ్డీ రుణాల నుండి బయటపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుత రుణాలను తక్కువ వడ్డీతో ఉన్న బ్యాంకు రుణాల్లోకి మార్చుకోవడం, రైతులకు ఆర్థిక ఉపశమనం కలిగిస్తుందని చెప్పారు. రుణ మార్పిడి ప్రక్రియలో పత్రాల ప్రాముఖ్యత, బ్యాంకులతో నేరుగా మాట్లాడాల్సిన అవసరం, మధ్యవర్తులపైన ఆధారపడకూడదన్న విషయాల్లో రైతులకు సూచనలు ఇచ్చారు. రైతులకు అధిక రుణ భారానికి సంబంధించిన సమస్యలు ఏమైనా ఉన్నట్లయితే జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదించవచ్చని తెలియజేశారు. సమావేశం అనంతరం పలువురు రైతులు ఋణమార్పిడి పథకం గురించి స్పష్టమైన అవగాహన కలిగిందని, దీనివల్ల రుణ భారాన్ని తగ్గించుకునే నమ్మకం కలిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, సెక్రటరీ రమేష్ పాల్గొన్నారు.

## అంబేద్కర్ యువజన సంఘం మండల నూతన అధ్యక్షులుగా మంచాల హరీష్...



**చెన్నారావుపేట, నవంబర్ 24(జనం సాక్షి):** మండల అంబేద్కర్ యువజన సంఘం నూతన అధ్యక్షులుగా మాధవనగర్ కాలనీకి చెందిన మంచాల హరీష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మధుపాక ఎల్లయ్య, వరంగల్ జిల్లా అధ్యక్షులు మంకాల యాదగిరి, జిల్లా ఉపాధ్యక్షులు మాణిక్యం లు సోమవారం తెలిపారు. ఈ సందర్బంగా నూతన అధ్యక్షులు మంచాల హరీష్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను అనుసరిస్తూ క్రమశిక్షణతో అంబేద్కర్ వీదేయుడిగా వివిధ కార్యక్రమాలను సక్రమంగా చేపట్టి తన సేవలను అందిస్తానని అన్నారు. ఈ పదవి రావడానికి సహకరించిన మండల కన్వీనింగ్ కమిటీ సభ్యులు రూపిక శ్రావణ్ కుమార్, నర్మట యాదగిరి, సాదు నర్సింగరావులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో అంబేద్కర్ యువజన సంఘం హన్మకొండ జిల్లా అధ్యక్షులు చిట్యాల బాబు, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మందెల అరుణ్ కుమార్, పెద్దలు కందిక సునీల్, మంచాల సదయ్య, మాజీ ఎంపీటీసీ మాదాసి కుమారస్వామి, బర్ల దేవదాస్, ఒంటరి రాములు, ఆకులపెల్లి ఉప్పలయ్య, రూపిక సుమన్, అలవాల నవీన్, రూపిక నటరాజు, ఆకులపెల్లి రవి, మహేష్, బాబు, ఆకులపల్లి అజయ్, మంద చిన్ను, మేకల చందు, సాదు రాజు, బరిగెల మహేష్, దిలీప్, పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ల జీవో కాపీలు



**మహబూబాబాద్ బ్యూరో, నవంబర్ 24(జనం సాక్షి):** భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టియు)జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ ల జీవో కాపీలను సోమవారం మహబూబాబాద్ పట్టణంలోని వివేకానంద సెంటర్లో దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఐఎఫ్టియు రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ హలవత్ లింగన్న జిల్లా అధ్యక్షులు పర్వత కోటేష్ లు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న హక్కులపై కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు దాడి చేస్తాయని, కార్మికులను కట్టు బానిసలుగా చేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు.రాష్ట్రాలలో అధికారంలో ఉన్న ప్రతిపక్ష పార్టీలు లేబర్ కోడ్ల అమలకు పూనుకోవద్దని అన్నారు. ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షులు కామ్రేడ్ ఎండి జబ్బర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా నాయకులు తెలబోయిన కృష్ణ, నూకల మురళి, పులిగిల్ల బాలమల్లు, సురేష్, లింగన్న ,శంకర్, గోపి, వీరన్న, రమేష్, రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



**స్టేషన్ ఘన్ పూర్, నవంబర్ 24 ( జనం సాక్షి ) :** 25, 26, 27 తేదీలలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరుగు మత్స్యకారుల రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని టీఎంకేఎంకేఎస్ జిల్లా కార్యదర్శి మునిగేల రమేష్ కోరారు. మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో సోమవారం తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభల పోస్టర్ ను ఆవిష్కరిం చారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కార్యదర్శి మునిగేల రమేష్ హాజరై మాట్లాడుతూ కరీంనగర్ పట్టణ కేంద్రంలో జరుగుతున్నాయని మొదటి రోజు 25న వేలాది మంది మత్స్యకారులచే పట్టణ కేంద్రంలో భారీ ప్రదర్శన, రెవిన్యూ గార్డెన్ లో సదస్సు ఉంటుంద ని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జనాభాలో అత్యధిక శాతంగాఉన్న మత్స్యకారులు సమస్యలతో ఉన్నారని వారి సమస్యలు తీర్చడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు.మత్స్యకారులసొసైటీ అకౌం ట్లో డబ్బులు జమ చేయాలని,50 సంవత్సరాలు దాటి న ప్రతి మత్స్యకారులకు పెన్షన్ ఇవ్వాలని తదితర సమస్యలపై ఈ మహాసభలలో రాష్ట్ర వ్యాప్తంగా మత్స్యకారులు ఎదుర్కొంటున్నసమస్యలను చర్చించి వాటి పరిష్కారంకై ఉద్యమ కార్యచరణ రూపొందిస్తా మని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు లింగనబోయిన అశోక్, తోడంగల ఐలయ్య, అన్నెపు రాములు, లింగనబోయిన రాజు, లింగనబోయిన రాములు,అన్నెపు రాజు,పిట్టల శ్రీనివాస్,లింగనబోయి న శ్రీనివాస్, బోయిని శంకర్,పిట్టల నాగరాజు, అన్నెపు వెంకటయ్య, యల్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీల సత్వర పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలి

- **హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్.**
- **జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 159 అర్జీలు**

**హనుమకొండ ప్రతినిధి నవంబర్ 24 (జనం సాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరించిన అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశపు హాలులో ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్,



అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డిలకు అర్జీలను అందజేశారు. ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులను ప్రజలు అందించిన అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో గృహ నిర్మాణ, మున్సిపల్, రెవెన్యూ, డి ఆర్ డి ఓ, వ్యవసాయ, ఉపాధి కల్పన, ఇతర శాఖలకు సంబంధించి స్వీకరించిన 159 సమస్యలను మానవతా దృక్పథంతో పరిశీలించి త్వరితంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్, డిఆర్డిఓ మేన శ్రీను, హనుమకొండ,పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, పలువురు తహసిల్దార్లు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో మహిళలకు చీరలు



**మహా ముత్తారం నవంబర్ 23 (జనంసాక్షి) :** గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇందిరా క్రాంతి మహిళా శక్తి ఇందిరమ్మ చీరల పంపిణీ మండల అభివృద్ధి అధికారి నిశాంత్ పంపిణీ చేశారు. సోమవారం మండలంలోని వజినే పల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఇందిరా మహిళా శక్తి మహిళా స్వయం శాఖ సంఘం అక్క చెల్లెళ్లకు రాష్ట్ర ప్రభుత్వం పంపించిన చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వజినేపల్లి సూర్య గ్రామైక్య సంఘం( వివో) అధ్యక్షురాలు భూపెల్లి ఈశ్వరి, ఉపాధిహామీ ఏపీవో కుమారస్వామి. గ్రామైక్య సంఘం వీఎవో తొట్ల రాజేష్, పంచాయతీ కార్యదర్శి సమ్మరాజు, మాజీ వివో అధ్యక్షురాలు గోక లక్ష్మి, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.


## సీపీఎం పార్టీ బలపరిచే అభ్యర్థులను గెలిపించాలి



**పాలకుర్తి, నవంబర్ 24(జనంసాక్షి) :** వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ (మర్కిస్టు) బలపరిచే అభ్యర్థులను గెలిపించాలని. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం మండలంలోని గూడూరు గ్రామంలో ఆ పార్టీ మండల కమిటి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం బలపరిచే వారిని గెలిపించాలని కోరారు. దేశానికి కమ్యూనిస్టులు రక్షణగా నిలుస్తున్నారని అన్నారు. దేశాన్ని పెట్టబడి దారులు దోపిడి చేస్తున్నాయని మరో పక్క మతాలను రెచ్చగొట్టే పార్టీలతో దేశ భవిష్యత్తు అంధాకారంలో పడబోతోతందని విమర్శించారు. ఈ సమావేశంలో సోమ సత్యం, చిట్యాల సోమన్న, మండల కార్యదర్శి మాచెర్ల సారయ్య, మాసంపల్లి నాగయ్య, ఏదునూరు మదార్ ఉన్నారు.

## ప్రైవేట్ ఆసుపత్రులలో విస్తృత తనిఖీలు

- **జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్**



**మహబూబాబాద్ బ్యూరో, నవంబర్ 24(జనం సాక్షి):** మహబూబాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. రవి రాథోడ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ బృందం సోమవారం ప్రైవేట్ వైద్య సంస్థలపై విస్తృత తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా వెన్నెలా హాస్పిటల్, అమృత హాస్పిటల్ (మహబూబాబాద్), అర్జున్ డయాగ్నొస్టిక్ సెంటర్ (బయ్యారం)లను పరిశీలించారు. తనిఖీల సందర్భంగా ఆస్పత్రుల్లో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రెగ్యులేషన్, రిజిస్ట్రేషన్) యాక్ట్ – 2010 అమలు పరిస్థితిని వివరంగా పరిశీలించగా, యాక్ట్‌లో పేర్కొన్న కనిష్ట ప్రమాణాలు, నమోదు, సిబ్బంది అర్హతలు, రోగి రికార్డుల నిర్వహణ, పరికరాల ప్రమాణాలు, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై ఆసుపత్రి నిర్వాహకులకు స్పష్టమైన సూచనలు జారీ చేయబడాయి. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వహకులకు కఠినంగా హెచ్చరిస్తూ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ 2010 ను తప్పనిసరిగా అమలు చేయాలి, రోగి భద్రత, సేవల నాణ్యతపై ఎటువంటి రాజీ ఉండకూడదు, కనిష్ట ప్రమాణాలు పాటించనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని అని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన తెలిపారు.


## రైతులు వరి ధాన్యాన్ని మధ్యదారులకు అమ్మి మోసపోవద్దు

- **ఏఎంసి వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్**



**శాయంపేట ,నవంబర్ 24 (జనం సాక్షి) :** రైతులు పండించిన వరి ధాన్యాన్ని మధ్య దళారులకు అమ్ముకోవద్దని ప్రభుత్వం కేటాయించిన కొనుగోలు కేంద్రాలలో అమ్ముకొని ప్రభుత్వం కేటాయించిన మద్దతు ధర పొందాలని పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్ అన్నారు. సోమవారం భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ఆదేశం మేరకు మండలంలోని కాట్రపల్లి, సూర్య నాయక్ తండా, గోవిందపూర్ గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించమని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వం కేటాయించిన మద్దతు ధరతో పాటు సన్నధాన్యానికి క్వింటాకు 500 రూపాయల బోనస్ పొందాలన్నారు .ఈ దేశంలోనే తెలంగాణ రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యానికి బోనస్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం అన్నారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు రైతులను తాలూ తేమ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం వేణుగోపాలరావు ,శాయంపేట పిఎసిఎస్ సీఈవో రాజమోహన్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి, పోలేపల్లి శ్రీనివాస్ రెడ్డి, వైనాల కుమారస్వామి, చిందం రవి ,దుబాస్ కృష్ణమూర్తి, మారపెల్లి కట్టయ్య, జగన్ ,రఘు సింగ్, లక్ష్మణరావు, మొగిలి, మంజుల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పల్లె దవాఖానాలు ప్రారంభించాలి



**రాయపర్తి,నవంబర్ 24 (జనంసాక్షి):** గత ప్రభుత్వంలో మంజూరై నిర్మాణం పూర్తయిన పల్లె దవాఖానలను ప్రజల అవసరాల కోసం తొందరగా ప్రారంభం చేయాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మునావత్ నర్సింహానాయక్ అన్నారు.రాయపర్తి మండలంలో పలు పల్లె దవాఖానలలో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి తన ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొంత ఫర్నిచర్ సామాగ్రిని పల్లె దవాఖానలకు పంపిణీ చేయగా ఆ పల్లె దవాఖానలను మూసి వేయడం సరికాదని తోందరగా ఆ దవాఖానాలను పునః ప్రారంభం చేయాలని రాయపర్తి బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో గత ప్రభుత్వం హయాంలో 11 పల్లె దవాఖాన మంజూరు అయ్యి నిర్మాణం పూర్తి చేసుకొని ఉన్న,స్థానిక ప్రజల అవసరాలకు అందుబాటులో లేవని,కావున ఇప్పటికైనా కలెక్టర్ ద్రుష్టికి తీసుకోని వెళ్లి తొందరగా గ్రామాలలో ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి,మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు,మండల పార్టీ నాయకులు మునవత్ వెంకన్న,ముద్రబోయిన సుధాకర్,సంకినేని ఎల్లస్వామి, జగన్,తాళ్లపెల్లి కుమార్,బాపిరెడ్డి,కర్ణాకర్ రెడ్డి,చందు లక్ష్మన్,కప్పల రాజు,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సంక్షేమమే లక్ష్యం..

**కోడూరు శివకుమార్ గౌడ్**



**బచ్చన్నపేట నవంబరు 24 (జనం సాక్షి):** జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని కొన్నే గ్రామానికి చెందిన కోడూరు శివకుమార్ గౌడ్ ఆపదలో గ్రామ ప్రజలను ఆదుకోవడం గ్రామ అభివృద్ధి లక్ష్యంగా సేవ చేస్తున్నాడు. సేవలో భాగంగా సోమవారం గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో ఇటీవల జరుగుతున్నటువంటి దొంగతనాలు, ఆగడాలు చూసి చలించి తన సొంత ఖర్చులతో గ్రామానికి నా వంతు కొంత సహకారంతో స్కూల్ లో సోలార్ కెమెరా అమర్చడం జరిగిందన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కెమెరా 24 గంటలు ఆన్లైన్ పర్యవేక్షణలో ఉంటుందని విద్యార్థులు మంచిగా చదువుకొని గ్రామానికి కన్న తల్లిదండ్రులకు పేరు తేవాలని అన్నారు. ఈ సందర్భంగా శివకుమార్ గౌడ్ స్కూల్ హెచ్ఎం తో సహా గ్రామ ప్రజలు అభినందించారు.

## అర్హులైన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీర




**రాయపర్తి,నవంబర్ 24(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తున్న ఇందిరమ్మ చీరలను పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ఆదేశాల మేరకు రాయపర్తి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో అర్హులైన మహిళలకు స్థానిక ఎమ్మార్వో శ్రీనివాస్ అందించారు. కార్యక్రమంలో అడిషనల్ డిఆర్డిఓ రేణుకాదేవి, ఏపీఎం రవీందర్,పంచాయతీ కార్యదర్శి వినోద్ కుమార్,కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు మచ్చ రమేష్,తాజా మాజీ ఉపసర్పంచ్ ఎండి మహమ్మద్,నాయకులు ఉస్మాన్,రఫీ,సీసిలు గ్రామ పెద్దలు గ్రామ సంఘం ప్రతినిధులు మహిళా సంఘాల ప్రతినిధులు,వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

## జనగామ జిల్లా దిశ కమిటీ సభ్యుడిగా కొర్ర వెంకటేష్ నాయక్



**స్టేషన్ ఘన్ పూర్, నవంబర్ 24 (జనంసాక్షి) :** జనగామజిల్లా దిశ కమిటీ సభ్యుడి గా (జిల్లా గ్రామీణా భివృద్ధి సంస్థ) స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని చిల్పూర్ మండలం దేశాయి తండ గ్రామానికి చెందిన చెందిన కొర్ర వెంకటేష్ నాయక్ నియమించబడ్డారు. ఈ సందర్భంగా కొర్ర వెంకటేష్ నాయక్ సోమవారం హనుమకొండలోని ఎమ్మెల్యే కడియం నివాసంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యని, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మర్యాద పూర్వకంగాకలిసి దిశ కమిటీ సభ్య లుగా నియమించి నందుకు దిశ కమిటీ చైర్మన్ ఎంపీ కడియం కావ్యకి, సహకరించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరికి పూలమొక్కను అందజేసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఈ సందర్భంగా వెంకటేష్ నాయక్ కి స్వీట్స్ తినిపించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా సభ్యులు పాల్గొన్నారు.

## పరకాల మున్సిపల్ కమిషనర్ గా అంజయ్య



**పరకాల, నవంబర్ 24 (జనం సాక్షి):** పరకాల మున్సిపల్ నూతన కమిషనర్ గా సోమిరెడ్డి అంజయ్య సోమవారం రోజున బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కే .సుష్మ ఇంతవరకు ఇన్చార్జి కమిషనర్ గా కొనసాగారు. సోమయ్య మహబూబాబాద్ జిల్లా మెప్మా పీడిగా పనిచేసి బదిలీపై పరకాలకు వచ్చారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు, అధికారులు నూతన కమిషనర్ ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# వందేమాతరం గీతానికి నేటికి 150 ఏళ్లు

చిట్యాల, నవంబర్ 24( జనం సాక్షి): భారతదేశ స్వాతంత్ర సమరంలో జాతిని జాగృతం చేసిన వందేమాతరం గీతానికి నేటితో 150 ఏళ్లు నిండాయని బిజెపి జిల్లా అధ్యక్షులు ఏడు నూతుల నిషేధర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో వందేమాతరం జాతీయ గేయం 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు బుర్ర వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో స్మారకోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి జిల్లా అధ్యక్షులు ఏడు నూతుల నిషేధర్ రెడ్డి , పార్లమెంట్ కో కన్వీనర్ లింగంపల్లి ప్రసాద్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రం చౌరస్తాలో విద్యార్థులు, ఉపాధ్యాయులు బంకించంద్ర చటర్జీ రచించిన



జాతీయ గీతం "వందేమాతరం" ను గలమెత్తి గీతాలాపనం చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షులు నిషేధర్ రెడ్డి మాట్లాడుతూ వందేమాతర గేయం భారత స్వాతంత్ర సమరంలో ప్రజలకు స్ఫూర్తిదాయకంగా మారి దేశవ్యాప్తంగా ఉద్యమాలకు ప్రేరణ నిచ్చిందని తెలిపారు. వందేమాతరం కేవలం ఒక గీతం కాదని ఇది భారతమాత పట్ల ప్రేమను, గౌరవాన్ని, ఐక్యతను వ్యక్తం చేసే ఒక మహోన్నత మంత్రమని అన్నారు. స్వాతంత్ర సమరంలో ప్రజల మనసుల్లో ధైర్యం పెంచి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడే జోష్ నింపిందన్నారు. నవంబర్ 7, 1875 న బకించంద్ర చటర్జీ రచించిన జాతీయ గీతం "వందేమాతరం" విద్యార్థులకు జాతీయ చైతన్యం గుర్తుచేసే ఒక మంచి స్ఫూర్తి అని కొనియాడారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు చెక్క నరసయ్య, మండల మొగిలి గజనాల రవీందర్, పెండ్యాల రాజు, తీగల జగ్గయ్య, సుధగాని శ్రీనివాస్, గుండా సురేష్, మల్లేష్, గుర్రపు నాగరాజు, పూర్ణ, సారంగపాణి, అశోక్, రాజేందర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వాముల 'నగర సంకీర్తన'



మంగపేట నవంబర్ 24(జనంసాక్షి) : మండల కేంద్రంలో అయ్యప్ప స్వాములు 'నగర సంకీర్తన' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నగర సంకీర్తన సోమవారం ఉదయం భక్తుల కోలాట నృత్యాలతో, భజన పాటలతో ఊరేగింపు కార్యక్రమం గంపోనిగూడెం నుండి తెలంగాణ చౌరస్తా మీదుగా శ్రీ ఉమాచంద్రశేఖర స్వామి ఆలయం పరిసర ప్రాంతానికి చేరుకొని నుండి మరల తిరిగి గంపోనిగూడెం వద్ద నున్న గోదావరి పరివాహక ప్రాంతం వరకు సుమారు 500 మంది అయ్యప్ప స్వాములతో ఘనంగా 'నగర సంకీర్తన' ను కార్యక్రమం నిర్వహించారు. గంపోనిగూడెం కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గోనె మధుసూదనరావు తొలిసారిగా అయ్యప్ప మాల దీక్షలు ధరించగా (కన్నెస్వామి) తన దీక్షా కార్యక్రమంలో భాగంగా తన కుటీరం (గంపోనిగూడెం కుటీరం) గురుస్వామి పిల్లలమర్రి కరుణాకర్ గురుస్వామి పర్యవేక్షణలో అయ్యప్ప స్వాముల నగర సంకీర్తన కార్యక్రమానికి ఏర్పాటు చేశారు. అనంతరం అయ్యప్ప స్వామికి గంగా నది స్నానం స్నానం, అభిషేక కార్యక్రమాల్లో భాగంగా గోదావరి నదిలో అయ్యప్పస్వామి విగ్రహానికి గంగా స్నానం, అభిషేక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వాములకు మహా అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు.



## శాయంపేట పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన ఈస్ట్ జోన్ డిసిపి

శాయంపేట ,నవంబర్ 24 ( జనం సాక్షి) : శాయంపేట పోలీస్ స్టేషన్ మరియు సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో సోమవారం ఈస్ట్ జోన్ డిసిపి వార్షిక తనిఖీ నిర్వహించామని తెలిపారు. ఇందులో భాగంగా డిసిపి పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, మొక్కలను నాటి మరియు పోలీస్ స్టేషన్ రికార్డ్స్ చెక్ చేసిన అనంతరం తగిన సూచనలు అధికారులకు ఇచ్చినారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ సతీష్ బాబు , సిఐ రంజిత్ రావ్ , మరియు ఎస్సై పరమేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

## సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమస్యలపై ఉద్యమించాలి

**ఏఐటియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజు**



హనుమకొండ ప్రతినిధి నవంబర్ 24 (జనం సాక్షి) : హనుమకొండ సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమస్యలపై ఉద్యమించాలని ఏఐటియూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజు అన్నారు. తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయ్ హమాలీ వర్కర్స్ యూనియన్ హనుమకొండ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల ప్రథమ మహాసభ సోమవారం కుక్కల మల్లయ్య అధ్యక్షతన హనుమకొండలోని గిరిజన సంక్షేమ కమిటీ హాల్ లో జరిగింది. ఈ మహాసభకు మూడు జిల్లాల నుంచి సుమారు గా 300మందికి పైగా హమాలీ కార్మికులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హనుమకొండ బస్సు డిపో దగ్గర నుండి గిరిజన సంక్షేమ కమిటీ హాల్ వరకు కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా ఏఐటియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజు, రాష్ట్ర సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ అధ్యక్షులు గుంపెల్లి మునీశ్వర్ హాజరయ్యారు.

## గౌడ సంఘం ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు...

**ఘనంగా కోనాపురం గ్రామంలో శ్రీకంఠమహేశ్వర స్వామికి జలాభిషేకం..**



చెన్నారావుపేట, నవంబర్ 24 (జనం సాక్షి): మండలంలోని కోనాపురం గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.సోమవారం గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన శ్రీ కంఠమహేశ్వర స్వామికి జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్లతో గౌడ కులస్తులు గ్రామంలోని వివిధ గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరి పొలిమేరలో మామిడి తోరణాలను కట్టారు.ప్రతి ఇంటి నుండి జల బిందెలతో ఊరేగింపుగా గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం సమీపంలోని కంఠమేశ్వర స్వామి ఆలయానికి తరలివచ్చి కంఠమహేశ్వర ఆలయం వద్ద జలాభిషేకం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలను చేపట్టారు.ఈ కార్యక్రమంలో గౌడ కులస్తులు, గీత కార్మికులు, మహిళలు, యువకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## దీపం అంటుకొని ఇంట్లో వస్తువులు దగ్ధం



తొర్రూరు , నవంబర్ 24 (జనం సాక్షి) : తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామంలో బేడ బుడగ జంగాల కాలనీకి చెందిన కడెం మల్లికంబ సోమవారం దేవుడికి దీపం వెలిగించింది. ప్రమాదవశాత్తు దీపం అంటుకొని ఇంట్లోని నగదు, బట్టలు, కాగితాలు, బీరువా, బియ్యం వంటి విలువైన వస్తువులు కాలి బూడిదయ్యాయి. వీటి విలువ సుమారు రూ. లక్ష వరకు ఉంటుందని బాధితురాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

## భారత రాజ్యాంగాన్ని అధ్యయనం చేయాలి : ఎంఈఓ



చిట్యాల, నవంబర్ 24( జనం సాక్షి): అంబేద్కర్ చరిత్రను, భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్క పౌరుడు అధ్యాయనం చేయాలని ఎంఈఓ కోడెపాక రఘుపతి, అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డికిష్టయ్య అన్నారు. ఈ మేరకు మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రంలోని జెడ్ పి హెచ్ ఎస్ హై స్కూల్ లో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు జన్నె యుగంధర్ ఆధ్వర్యంలో చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండల స్థాయి ప్రతిభ పాటల పోటీల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ కోడెపాక రఘుపతి, పుల్ల మల్లయ్య, దొడ్డి కిష్టయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూడు మండలాల స్థాయి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో 8, 9 ,10 తరగతిలో చదువుతున్న విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం ,పాటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు రమేష్, హై స్కూల్ ఇంచార్జ్ హెచ్ఎం రఘుపతి, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు బుర్ర లక్ష్మణ్ గౌడ్, ఏవైఎస్ మండల ప్రధాన కార్యదర్శి పుల్ల ప్రతాప్, మండల ఉపాధ్యక్షులు కట్కూరి శ్రీనివాస్, దూడపాక సరోత్తమ్, దాసరపు నరేష్, గుర్రపు రాజమౌళి, గడ్డం సదానందం, బత్తుల ఉపేందర్, ప్రవీణ్ తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘాట్ రోడ్డుపై భక్తుల సహకారంతో రేకుల షెడ్డు నిర్మాణ పనులు

**రూ.5 లక్షల వ్యయంతో పనులు ప్రారంభం**



పాలకుర్తి, నవంబర్ 24 (జనంసాక్షి) శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఘాట్ రోడ్ మార్గంలో భక్తుల సౌకర్యార్థ భక్తుడు రూ. 5 లక్షల వ్యయంతో నిర్మాణ పనులు సోమవారం ప్రారంభించినట్లు ఆలయ ఈవో భాగం లక్ష్మీ ప్రసన్న తెలిపారు. మహబూబాద్ జిల్లా దంతాలపల్లి గ్రామానికి చెందిన వంగ సోమిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి కుటుంబ సభ్యులు ఘాట్ రోడ్డు మార్గంలో ప్రయాణించే భక్తులకు ఎండాకాలం, వర్షాకాలం ఇబ్బందులు కలగకుండా ఘాట్ రోడ్ మార్గంలో రూ. 5 లక్షల వ్యయంతో రేకులతో షెడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరిటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరా మహిళాశక్తి చీరలు పంపిణీ



మహదేవపూర్: నవంబర్ 24 (జనంసాక్షి) : ఇందిరా మహిళాశక్తి చీరేల పంపిణీ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు. సింగిల్ విండో చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి .మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అక్బర్ ఖాన్ పాల్గొని మహదేవపూర్ మండలంలో మహిళా సమైక్య సంఘాల మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరేలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో. జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు. సింగిల్ విండో చైర్మన్ చల్లా తిరుపతిరెడ్డి. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అక్బర్ ఖాన్ మాజీ ఎంపీపీ రాణి భాయి. మాజీ ఎంపీటీసీ ఆకుతోట సుధాకర్. ఐకెపి ఏపీఎం మహిళలు పాల్గొన్నారు.

## ఝాన్సీ రెడ్డికి నామినేటెడ్ పదవి ఇవ్వాలి

తొర్రూరు, నవంబర్ 24 (జనం సాక్షి) : టీపీసీసీ ఉపాధ్యక్షురాలుగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి విశేష సేవలు అందిస్తున్న కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సమ్మకు నామినేటెడ్ పదవి ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ లకు విజ్ఞప్తి చేశారు.శనివారం సురేష్ విలేకరులతో మాట్లాడుతూ తమ ప్రాంతంలో పార్టీ కోసం ఆమె చేస్తున్న కృషిని గుర్తించి గౌరవించాలని కోరారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును ఓడించి కాంగ్రెస్ జెండా ఎగరవేసిన ఝాన్సమ్మలాంటి అప్రతిహత నాయకురాలుకు అవకాశం కల్పిస్తే గ్రామస్థాయిలో పార్టీకి మరింత బలం చేకూరుతుందని అన్నారు.ఝాన్సీ రెడ్డికి కార్పొరేషన్ చైర్మన్ లేదా ఎమ్మెల్సీ ఇవ్వాలని కోరారు.

## మృతుని కుటుంబానికి మాజీ ప్రభుత్వ విప్ నల్లాల ఓదేలు పరామర్శ



భీమదేవరపల్లి నవంబర్ 24 (జనం సాక్షి) : భీమదేవరపల్లి మండలంలోని మాణిక్యాపూర్ గ్రామానికి చెందిన బుర్ర రాజయ్య అనారోగ్యంతో ఇటీవల కన్నుమూశారు. ఈ విషయం తెలిసిన వెంటనే మాజీ ప్రభుత్వ విప్ నల్లాల ఓదేలు సోమవారం మృతుని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాజయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన ఆరోగ్య సమస్యలు మరణ వివరాలను కుటుంబ సభ్యుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పూదరి చంద్రమోహన్, మాజీ ఎంపీటీసీ గడ్డం వెంకన్న, నాయకులు ఊదరి కుమారస్వామి, రాజశేఖర్, మల్లేష్, కుంట రవి,వెంకట్రాజం, మల్లయ్యతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.